
సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

## మల్లికార్జుననగర్‌లో రూ. 80 లక్షలతో సీసీ రోడ్డు

**నల్లకుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జుననగర్‌లో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ మాజిద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు

## బ్రాండ్ విజిబులిటీ పెంచాలని ర్యాలీ

**రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** బ్రాండ్ విజిబులిటీ పెంచాలని కోరుతూ శుక్రవారం ముషీరాబాద్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ నుంచి గోల్కొండ చౌరస్తా, బాకారం, స్పెన్సర్ మార్కెట్, ఆర్టీసీ క్రాస్‌రోడ్ వరకు ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్‌ఎన్‌ఎల్ సీజీఎం ఏరియా-1 అధికారి ఎం. చంద్రశేఖర్, ఉత్తరమండలం డీజీఎం ఎం. నర్సింహులు, ముషీరాబాద్ ప్రాంతీయ ఏజీఎం ఎస్.మురళీకృష్ణ మాట్లాడారు. బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ర్యాలీలో బీఎస్‌ఎన్‌ఎల్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు, సంయుక్త కార్యదర్శి కె. అశోక్‌కుమార్, అధికారులు మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌డీ రామకృష్ణ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

మెదడువాపు నివారణకు

## పిల్లలకు జేఈ వ్యాక్సిన్ వేయించాలి

**ముషీరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** మెదడు వాపు నివారణకు 9 నెలల శిశువు నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలకు జపనీస్ ఎన్సెఫాలిటీస్ (జేఈ) వ్యాక్సిన్ వేయించాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌ఎన్ ఫెల్లిస్ పేర్కొన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జేఈ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఫెల్లిస్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలకు జేఈ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు విజయకుమారి, సునీత, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ దేవాలయంలో బీఆర్‌ఎస్ నేతల పూజలు

**ముషీరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** పార్సీగుట్టలోగల ఎల్లమ్మ దేవాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ, గౌరీ శంకర ఆలయ కమిటీ చైర్మన్ పి. శ్రీధర్‌చారి, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాయిబాబా

## దేగరి కంచెను న్యూయార్క్‌లా చేస్తామనడం హాస్యాస్పదం

**రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** మహేశ్వరం నియోజకవర్గం దేగరి (ముచ్చర్ల) కంచెను న్యూయార్క్ నగరంగా అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదం అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా ఆరోపించారు. శుక్రవారం టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుక్కలు, దోమల బెడద, ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే పరిష్కరించలేని ప్రభుత్వం ప్రజలు లేని ప్రాంతాన్ని న్యూయార్క్ నగరంగా అభివృద్ధి చేస్తామనడాన్ని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ హైదరాబాద్‌ను డల్లాస్‌గా చేస్తానని, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి న్యూయార్క్ నగరంగా చేస్తామని ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్. ప్రకాష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

**చిక్కడపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** ప్రవీణ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో నిర్వహించిన సంగీత సాహిత్య సమలంకృతే సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్‌రావు పర్యవేక్షణలో పవన్‌కుమార్, శివరామకృష్ణ, రవిశంకర్, దేవకృష్ణ, హరివిమల, రామకృష్ణ, లలితారావు, గంటి శైలజ, ఇందునైన, రామలక్ష్మి, శశిరేఖ, ఆనంద్‌రెడ్డి దాశరథి రంగాచార్య, సినారె గీతాలను ఆలపించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి గాయనీగాయకులను అభినందించారు.

## బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ అయిలయ్య అన్నారు. బ్రాహ్మణ సేవా సమాఖ్య ప్రతినిధులు శుక్రవారం ఆయనను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి సత్కరించారు. బ్రాహ్మణ సేవా సమాఖ్య కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బ్రాహ్మణుల విదేశీ విద్యకు 800 మంది విద్యార్థులకు రూ. 150 కోట్లు విడుదలకు సహకరించాలని అయిలయ్యను కోరారు. జిల్లాల్లో బ్రాహ్మణ భవనాలు, వేద పాఠశాలలు, కల్యాణ భవనాలు, గోశాలల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు మంగపతిరావు, స్వరూప్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.


బీర్ల అయిలయ్యను సన్మానిస్తున్న వక్కలంక శ్రీనివాస్‌రావు తదితరులు

వర్గీకరణపై సుప్రీం తీర్పును

# అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలి

- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా

**రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర, రాష్ట్ర సరిహద్దులలో వర్గీకరణ అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సెక్రటరీ సభ్యులు కేజీ రాంచందర్, కె. రంగయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తదితరులు మాట్లాడారు. వర్గీకరణపై 30 ఏళ్ల తరువాత తీర్పు వెలువడడం హర్షణీయమన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన అమలు చేయాలన్నారు. రేషన్‌కార్డులు, పెన్షన్‌లు, ఇళ్ల స్థలాలను అర్హులైన వారికి ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, వ్యవసాయ కార్మికులకు రూ. 12 వేల పెన్షన్ ఇవ్వాలని, బీడీ కార్మికులు, బీవోసీ కార్మికులకు జీవన భృతి రూ. 5 వేలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, రైతులు పండించిన అన్ని పంటలకు బోనస్, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 8న జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట నిరసన ప్రదర్శనలు, ధర్నా చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ఈ నెల 21న తమ పార్టీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి అనుమతించకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో నాయకులు రమ, వై.హన్మేష్, ఎస్.ఎల్.పద్మ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోటు రంగారావు


వీఎస్టీ చౌరస్తాలో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

## మందకృష్ణ పోరాటం వల్లే వర్గీకరణ

**ముషీరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** మందకృష్ణ పోరాటం వల్లనే ఎస్సీ వర్గీకరణ జరిగిందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గండి కృష్ణ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు దశరథ్ ఆధ్వర్యంలో వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పుతో మాదిగలకు విద్య, ఉద్యోగ నియామకాల్లో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్, నాయకులు ఎల్లయ్య, వినయ్‌రావు, వెంకటేష్, నర్సింగ్‌రావు, రాజు, దానయ్య పాల్గొన్నారు.


మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గండి కృష్ణ తదితరులు

### సుప్రీం తీర్పు హర్షణీయం

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జ్ఞానీ ఆధ్వర్యంలో వీఎస్టీ చౌరస్తాలో అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, కిషోర్, ఆకారం శ్రీనివాస్, మేడి సత్యనారాయణ, రామస్వామి, అస్లాం, నాగమయ్యకుంట బస్తీ అధ్యక్షుడు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా

# 29న 'చలో సచివాలయ ముట్టడి'

**కవాడిగూడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మాలమహానాడు తిరుగుబాటు చేపడుతుందని దళిత మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వీఎల్ రాజు, దళిత బహుజనపార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. వర్గీకరణపై సుప్రీం తీర్పుపై మాలమహానాడు ఆధ్వర్యంలో న్యాయపోరాటం చేస్తామన్నారు. శుక్రవారం దోమలగూడలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదని 2004లో ఇచ్చిన తీర్పుకు భిన్నంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో వర్గీకరణకు ఆర్డినెన్స్ తీసుకొస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన దుర్మార్గమైన చర్య అని అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 29న చలో సచివాలయ ముట్టడి కార్యక్రమం చేపడతామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ భాస్కర్, దళిత బహుజన పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్ రావు, గ్రేటర్ అధ్యక్షుడు సుబ్బారావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జయరాజ్, మేడ్చెల్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు వీఎల్ రాజు

## త్వరలో తెలుగు రాష్ట్రాల సీఎంలను కలుస్తా

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

**కవాడిగూడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ఏ రాజకీయ పార్టీ చేయని పనిని సుప్రీంకోర్టు చేసి మాదిగలకు సంపూర్ణ న్యాయం చేసిందని మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు. వర్గీకరణకు అనుకూలంగా వ్యవహరించిన ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతిస్తూ శుక్రవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. దేశానికి 70ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం వస్తే సుప్రీంకోర్టు తీర్పుతో ఇప్పుడు మాదిగలకు స్వేచ్ఛ లభించిందని అన్నారు. వర్గీకరణకు అండగా ఉన్న తెలుగు రాష్ట్రాల సీఎంలను త్వరలో కలుస్తానని చెప్పారు.


అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మోత్కుపల్లి నర్సింహులు

# సేవలందిస్తున్న జంటలకు పురస్కారం అభినందనీయం

**చిక్కడపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** భార్యాభర్తలు ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనుకోకుండా ఒకరికొకరు సహకరించుకుంటూ సంసారాన్ని ముందుకు నడిపితే అన్నీ విజయాలే లభిస్తాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ 29వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో విజయంలో భార్యాభర్తల భాగస్వామ్యం పేరిట పురస్కారాల ప్రదానసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ రాధారాణి భార్యాభర్తలను సన్మానించి మాట్లాడారు.

వివిధ రంగాల ద్వారా సమాజానికి సేవలు అందిస్తున్న జంటలను ఎంపిక చేసి పురస్కారాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఉమర్ ఖాన్ దంపతులు(సేవారంగం), డా. పద్మజ- డా. శ్రీనివాసరాజు (వైద్య రంగం), టీవీ రంగయ్య మాస్టారు(నాటక రంగం), టి. శ్రీనివాసన్- ములుగు శివజ్యోతి(పంచాంగకర్తలు), రమేష్- పార్వతి(సేవారంగం), శేషావతారం- రాజ్యలక్ష్మి(సేవారంగం)ని సత్కరించారు. కార్యక్రమంలో దిట్టకవి శ్రవణ్‌స్వామి, భార్గవి, సీఎల్ఎన్ గాంధీ, జి. హనుమంతరావు, చిల్ల రాజశేఖరరెడ్డి, లంక లక్ష్మీనారాయణ, నిర్వాహక సంస్థ కార్యదర్శి లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


పురస్కార గ్రహీతలతో జస్టిస్ రాధారాణి తదితరులు

## పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి

**రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న అవార్డు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రాంనగర్‌గుండులోని పింగళివెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కెహెచ్ఎస్ జగదాంబ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య 146వ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుబ్రహ్మణ్య ప్రసాద్ పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బహుమతులు అందజేశారు. పింగళి వెంకయ్య జీవిత చరిత్ర తెలిసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పీవీ చలం, శ్యామల్‌రావు, అనుదీప్, కె. వెంకటేశ్వరరావు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మొమెంటోలు అందజేస్తున్న పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్, పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కెహెచ్ఎస్ జగదాంబ

### పింగళి సేవలు మరువలేనివి

**కవాడిగూడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య సేవలు మరువలేనివని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా శుక్రవారం ట్యాంక్‌బండ్‌పైగల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పింగళి వెంకయ్య ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలని సూచించారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో బోనాలు

**చిక్కడపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీక్రాస్ రోడ్‌లోని కార్మిక కమిషనరేట్ కార్యాలయ ఆవరణలోగల అమ్మవారి ఆలయంలో శుక్రవారం బోనాల వేడుకలు నిర్వహించారు. కార్మికశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అదనపు కమిషనర్ డా. ఇ. గంగాధర్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

- అశోక్‌నగర్‌లోని జలమండలి కార్యాలయ ఆవరణలోగల అమ్మవారి ఆలయంలో శుక్రవారం బోనాల వేడుకలు నిర్వహించారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


బోనాల వేడుకల్లో కార్మిక శాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య, అధికారులు, సిబ్బంది


జలమండలి కార్యాలయంలో బోనాల వేడుకల్లో కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, అధికారులు, సిబ్బంది

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**బర్కత్‌పుర, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం 35 ఏళ్ల వయసుగల వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైలులో ల్యాప్‌టాప్ చోరీ

రైలులో ప్రయాణిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ల్యాప్‌టాప్‌ను దొంగలు చోరీ చేశారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన రోహిత్‌కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. మైసూరు ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడ వస్తున్నాడు.

గద్వాల్ రైల్వే స్టేషన్ సమీపంలో బాత్‌రూమ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ల్యాప్‌టాప్ బ్యాగ్ కనిపించకపోవడంతో కాచిగూడ రైల్వే పీఎస్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ తెలిపారు.

## 9, 10 తేదీల్లో ఆదివాసీల హక్కులు, కార్పొరేటీకరణపై సదస్సు

**బర్కత్‌పుర, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** ఆదివాసీలపై జరుగుతున్న విధ్వంసంపై చర్చ జరగాల్సిన అవసరం ఉన్నదని ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ ప్రశ్నించిన ఆదివాసీలను అణచివేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 9, 10 తేదీల్లో 'ఆదివాసీల హక్కులు-కార్పొరేటీకరణ-సంఘీభావ ఉద్యమాలు' అన్న అంశంపై నిర్వహించే అఖిలభారత సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, అన్వర్ ఖాన్, అమరుల బంధుమిత్రుల సంఘం ప్రతినిధి భవానీ, తెలంగాణ ప్రజాఫ్రంట్ ప్రతినిధి నాగభూషణం, ప్రజా కళామండలి అధ్యక్షుడు జాన్, దేశభక్త ప్రజాతంత్ర ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

### గుర్రంపోడు గిరిజనులకిచ్చిన భూములకు పట్టాలివ్వాలి

1959లో నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణ సమయంలో నిర్వాసితులకు గుర్రంపోడు తండాలో కేటాయించిన భూములకు తక్షణమే పట్టాలివ్వాలని పలు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో పీయూసీఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవింధ్యాల, అధ్యక్షుడు బాలకిషోర్‌రావు, గుర్రంపోడు భూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు బాలాజీనాయక్, గిరిజన సంఘం అధ్యక్షుడు ధర్మానాయక్ మాట్లాడారు. కొందరు కబ్జాదారులు గిరిజనులకు కేటాయించిన భూములపై కన్నేశారని ఆరోపించారు.

## నర్సింగ్ కౌన్సిల్‌లో అక్రమాలపై విచారణ జరిపించండి

**బర్కత్‌పుర, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** నర్సింగ్ కౌన్సిల్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నీల వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ 11 ఏళ్లుగా ఒకేచోట తిష్టవేసి అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తూ విద్యార్థులకు నష్టం చేస్తున్నారని ఆరోపించారు. నర్సింగ్ కళాశాలలు రిజిస్ట్రార్ అండదండలతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడం వల్ల చాలామంది విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మంత్రిని కలిసిన వారిలో జేఏసీ నేతలు శివకృష్ణ, సాయికృష్ణ, మధు, మహేష్ తదితరులు ఉన్నారు.


మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న నీల వెంకటేష్ తదితరులు

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చిక్కడపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆజామాబాద్, హైదరాబాద్-2 సిటీ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని సీబీడీ ఏడీఈలు విజయభాస్కర్, ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. ఆజామాబాద్, దయారా మార్కెట్ నెహ్రూనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, ఆజామాబాద్, మూన్‌కేఫ్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు, చిక్కడపల్లి, బాపునగర్, శాస్త్రినగర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## రేపు పండగలా మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి

**రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** ప్రముఖ కర్ణాటక శాస్త్రీయ సంగీత విద్వాంసులు, పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ 94వ జయంతిని ఈనెల 4వ తేదీన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ వాయిద్య కళాకారుల సంఘం, రాఘవర్షిని కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని జాతీయ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్. చెన్నారావు తెలిపారు. జయంతి కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. బాలమురళీకృష్ణ జయంతిని పండగలా నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, హైకోర్టు జడ్జి రాధారాణి, ఐఏఎస్ విశ్రాంత అధికారి రమణాచారి, దేవాదాయశాఖ కమిషనర్ సునీల్‌కుమార్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్ణాటక శాస్త్రీయ సంగీత విద్వాంసులు డీవీ మోహనకృష్ణ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎల్. చెన్నారావు, డాక్టర్ డీవీ మోహనకృష్ణ తదితరులు

## ఏవియేటర్స్ మీట్

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** విమానయానరంగంలో విశేష సేవలందించిన ఏవియేటర్లతో ఏర్పడిన హైదరాబాద్ ఏవియేటర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏవియేటర్స్ సమావేశం గురువారం రాత్రి మాదాపూర్‌లోని ఓ సంస్థ షో రూమ్‌లో జరిగింది. దాదాపు 250 మంది ఏవియేటర్స్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో 50 ఏళ్ల క్రితం విమానయాన రంగంలో సేవలందించిన వ్యక్తులు కూడా పాల్గొనడం విశేషం. ఏవియేషన్ రంగంలో నూతనంగా కెరీర్ ప్రారంభించిన వారికి తమ అనుభవాలను చెప్పిన వారు, ఈ రంగంలో ఏ విధంగా ఉండాలో తగు సూచనలు కూడా చేశారు. హైదరాబాద్ ఏవియేటర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కెప్టెన్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. 18 ఏళ్ల క్రితం తొలిసారిగా ఏవియేటర్స్ మీట్ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏవియేషన్ హిస్టారియన్ అనురాధారెడ్డి, అసోసియేషన్ సహ వ్యవస్థాపకులు కెప్టెన్ మార్క్ నీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ పీజీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):** యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)లో ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో 2024-25కు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కామన్ యూనివర్సిటీస్ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) 2024లో స్కోరు సాధించిన అభ్యర్థులు తాము ఎంచుకున్న కోర్సులో అడ్మిషన్ కోసం ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మొత్తం 442 సీట్ల భర్తీ నిమిత్తం ఈనెల 22 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని, సెప్టెంబర్ 2 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.